

# రాజ్‌తరుణ్ 'భలే ఉన్నాడే'

సంక్రాంతి బరిలో దిగిన 'నా సామిరంగ' చిత్రంలో కీలకమైన పాత్రలో మెప్పించారు యువ హీరో రాజ్‌తరుణ్. ఆయన నటిస్తున్న తాజా చిత్రానికి 'భలే ఉన్నాడే' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. దర్శకుడు మారుతి టీమ్ ప్రొడక్ట్ సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని రవికిరణ్ ఆర్ట్స్ పతాకంపై ఎన్వీ కిరణ్ కుమార్ నిర్మిస్తున్నారు. జే.శివసాయివర్ధన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆదివారం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఇందులో రాజ్‌తరుణ్ చిరునవ్వులు చిందిస్తూ ఉల్లాసంగా కనిపిస్తున్నారు. ఈ సినిమాలో సీనియర్ దర్శకులు సింగీతం శ్రీనివాస రావు కీలక పాత్రలో కనిపించనున్నారు. మనీషా కంద్కూర్, అభిరామి, అమ్ము అభిరామి, లీలా శాంసన్, హైపర్ ఆది, కృష్ణ భగవాన్, గోపరాజు రమణ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: నగేష్ బానెల్, సంగీతం: శేఖర్‌చంద్ర, ఆర్ట్: సురేష్ భీమగాని, రచన-దర్శకత్వం: జె.శివసాయివర్ధన్.

## ఫిబ్రవరిలో 'ఊరు పేరు భైరవకోన'



సందీప్ కిషన్ హీరోగా నటిస్తున్న చిత్రం 'ఊరు పేరు భైరవకోన'. వీఐ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్నారు. హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేశ్ దండా నిర్మిస్తుండగా, ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర సమర్పిస్తున్నారు. బాలాజీ గుత్తా ఈ చిత్రానికి సహ నిర్మాత. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 9న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్టు ఇటీవల మేకర్స్ ప్రకటించారు. సందీప్ కిషన్ మంత్రదండం పట్టుకొని కనిపించిన రిలీజ్ డేట్ పోస్టర్ ఆకట్టుకునేలా ఉంది. భైరవకోనలో చోటుచేసుకునే అనూహ్య సంఘటనలు, వాటివెనకున్న రహస్యాలు ఆద్యంతం ఉత్కంఠను పంచుతాయని చిత్ర బృందం పేర్కొంది. వర్ష బొల్లమ్మ, కావ్యా థాపర్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రాజ్ తోట, సంగీతం: శేఖర్ చంద్ర, మాటలు: భాను భోగవరపు, నందు సవిరిగాన, నిర్మాత: రాజేశ్ దండా, కథ-స్క్రీన్‌ప్లే-దర్శకత్వం: వీఐ ఆనంద్.

## హాలీవుడ్‌లో తెలుగమ్మాయి జోరు



చాలా కొద్దిమంది ఇండస్ట్రీకి వచ్చిన కొద్దిరోజుల్లోనే మంచి గుర్తింపును సంపాదించుకుంటారు. ఈ మధ్య చైల్డ్ ఆర్టిస్టులు కూడా ఎక్స్‌ట్రార్డినరీ ఫర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకుంటున్నారు. మహేశ్‌బాబు హీరోగా చేసిన 'బ్రహ్మోత్సవం' సినిమాలో నటించిన ఓ తెలుగమ్మాయి ఇప్పుడు హాలీవుడ్‌లో అదరగొడుతోంది. ఆ టీనేజ్ బ్యూటీ ఎవరో కాదు.. అవంతిక వందనపు. ప్రస్తుతం ఈమె వయసు 18. తెలుగు నేపథ్యం ఉన్న అవంతిక 'మీన్ గర్ల్స్ 2024' అనే హాలీవుడ్ చిత్రంలో నటించింది. ఆ వీడియోలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. 'మీన్ గర్ల్స్'లో కరేన్ శెట్టి పాత్ర పోషించిన అవంతిక నటనకు ప్రేక్షకుల ప్రశంసలు దక్కుతున్నాయి. విమర్శకులు సైతం పొగడ్తల వర్షం కురిపిస్తున్నారు. తెలుగు కుటుంబానికి చెందిన అవంతిక వందనపు 2005లో కాలిఫోర్నియాలో జన్మించింది. అక్కడే చదువుతూ యాక్టింగ్‌లోనూ ట్రైనింగ్ తీసుకుంది. టాలీవుడ్‌లో 2016లో మహేశ్‌బాబు కథానాయకుడిగా చేసిన 'బ్రహ్మోత్సవం'లో నటించింది. 'మనమంతా', 'ప్రేమమ్', 'రారండోయ్ వేడుక చూద్దాం', 'బాలకృష్ణుడు', 'ఆక్సిజన్', 'అజ్ఞాతవాసి' సినిమాల్లోనూ చేసింది. తర్వాత హాలీవుడ్‌కు వెళ్లిపోయింది. 'మీరా-రాయల్ ఫ్యూచర్ ప్రెసిడెంట్' అనే అమెరికన్ చిత్రంతో హాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చింది. 'డైరీ ఆఫ్ ఫ్యూచర్ ప్రెసిడెంట్', 'స్పిన్', 'సీనియర్ ఇయర్' చిత్రాల్లో నటించిన ఈ అమ్మడికి 'మీన్ గర్ల్స్'తో మంచి గుర్తింపు వచ్చింది. ప్రస్తుతం 'హారోస్కోప్' అనే హాలీవుడ్ హారర్ చిత్రంలో నటిస్తున్న ఈమె చేతిలో మరో సినిమా కూడా ఉంది. అవంతిక ప్రొఫెషనల్ కూచిపూడి డ్యాన్సర్ కూడా. పలు వేదికలపై డాన్స్ ఫర్ఫార్మెన్స్‌కు గాను అవార్డులు వచ్చాయి. ఈమె చిన్నప్పటి ఫొటోలు, ఇప్పటి ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు నెటిజన్లు. మొత్తమ్మీద 'మీన్ గర్ల్స్'తో టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారిపోయింది అవంతిక.



# వాటిని చూస్తే భయం

అగ్ర కథానాయిక సమంత ప్రస్తుతం నటనకు కాస్త విరామమిచ్చి ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటున్నది. సోషల్‌మీడియాలో మాత్రం తరచుగా అభిమానులతో టచ్‌లో ఉంటున్నది. తాజాగా ఈ భామ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పెట్టిన పోస్ట్ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. ఫ్లవర్ బొకేను (పుష్పగుచ్ఛం) ముందుపెట్టుకొని చూస్తున్న ఓ ఫొటోను షేర్ చేసిన సమంత..దానిపై ఓ ఇంట్రెస్టింగ్ కామెంట్ రాసింది. 'నాకు పువ్వులంటే చాలా ఇష్టం. కానీ అలర్జీ కారణంగా వాటికి దూరంగా ఉండాల్సి వస్తున్నది. అందుకే ఫ్లవర్ బొకేలను చూస్తే చాలు మనసులో రకరకాల భావాలు మెదలుతాయి. నా శరీరానికి ఈ ఫ్లవర్స్ పడవు. ఈ బొకేల వల్ల గతంలో ఓసారి ఎమర్జెన్సీ రూమ్‌కు వెళ్లాల్సి వచ్చింది. అందుకే ఇవంటే భయం' అని పేర్కొంది. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. గత ఏడాది 'ఖుషి' తర్వాత తెలుగులో మరే చిత్రాన్నీ అంగీకరించలేదు సమంత. హిందీలో మాత్రం 'సిటాడెల్' వెబ్‌సిరీస్‌లో నటిస్తున్నది.

## మైఖేల్ జాక్సన్ బయోపిక్



పాప్ కింగ్ మైఖేల్ జాక్సన్ బయోపిక్ తెరకెక్కుతోంది. ఈ చిత్రం 2025లో థియేటర్లలోకి రానుంది. జనవరి 22న సినిమా నిర్మాణాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆంటోయిన్ ఫుక్వా దర్శకత్వం వహిస్తున్నారు. జాక్సన్ మేనల్లుడు జాఫర్ జాక్సన్ ఈ చిత్రంలో దిగ్గజ సంగీతకారుడి పాత్రలో టైటిల్ రోల్‌ను పోషించనున్నాడు. జపాన్ మినహా యూనివర్సల్ పిక్చర్స్ ఈ చిత్రానికి సంబంధించి అంతర్జాతీయ హక్కులను కలిగి ఉంది. మైఖేల్ జాక్సన్ ఎస్టేట్‌కు సహ నిర్వాహకులుగా ఉన్న జాన్ బ్రాంకా, జాన్ మెక్‌క్లెయిన్‌లతో కలిసి గ్రాహం కింగ్ నిర్మిస్తున్నారు. 'గ్లాడియేటర్', 'ది ఏవియేటర్' చిత్రాలను రాసిన జాన్ లోగన్ స్క్రిప్ట్ రాశారు.



## కథ విన్నప్పుడే హిట్ అని చెప్పారు

'ఈ సినిమా ఫలితంతో చాలా ఆనందంగా ఉన్నా. సంక్రాంతికి హిట్ కొట్టాలనే సంకల్పంతో టీమ్ అందరూ కష్టపడ్డారు. మా అంచనాలను నిజం చేస్తూ సినిమాకు అద్భుతమైన స్పందన లభిస్తున్నది' అన్నారు అగ్ర నటుడు నాగార్జున. ఆయన కథానాయకుడిగా విజయ్ బిన్ని దర్శకత్వంలో తెరకెక్కిన 'నా సామిరంగ' చిత్రం ఆదివారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. శ్రీనివాస చిట్టూరి నిర్మించారు. అల్లరి నరేష్, రాజ్‌తరుణ్ కీలక పాత్రలను పోషించారు. ఆదివారం సాయంత్రం థాంక్స్‌మీట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ 'ఈ సినిమాకు కీరవాణి సంగీతం ప్రధానాకర్షణగా నిలిచింది. కొత్త దర్శకుడు విజయ్ బిన్ని అద్భుతంగా హ్యాండిల్ చేశాడు. అతనికి మంచి భవిష్యత్తు ఉంటుంది. నిర్మాత శ్రీనివాస చిట్టూరి కథ విన్నప్పుడే హిట్ పక్కా అన్నారు. ఈ రోజు ఆయన మాటలు నిజమయ్యాయి. కథలోని ఎమోషన్స్, కామెడీ, ఫ్రెండ్‌షిప్ అంశాలు ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటున్నాయి' అన్నారు. ఈ సినిమాలో వింటేజ్ నాగార్జునను చూసి ఆయన అభిమానులు సంబురపడుతున్నారని, తన ఫేవరెట్ యాక్టర్ నాగార్జునతో కలిసి కెరీర్‌లో గుర్తుండిపోయే పాత్రను చేశానని అల్లరి నరేష్ అన్నారు. అభిమానులకు మాటిచ్చిన విధంగానే సినిమాలో వింటేజ్ నాగార్జునను చూపించానని దర్శకుడు విజయ్ బిన్ని తెలిపారు. విడుదలైన అన్ని కేంద్రాల్లో అద్భుతమైన స్పందన లభిస్తున్నదని నిర్మాత శ్రీనివాస చిట్టూరి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

## అన్నీ గుర్తుంచుకునే 'క్లిక్ శంకర్'



బాలీవుడ్ అగ్ర హీరోల్లో ఒకరైన సైఫ్ అలీఖాన్ ప్రస్తుతం వరుస సినిమాలను అంగీకరిస్తున్నారు. తాజాగా ఆయన సైకలాజికల్ థ్రిల్లర్ కథకు ఓకే చెప్పారు. 'క్లిక్ శంకర్' పేరుతో తెరకెక్కించబోతున్న ఈ సినిమాకు తమిళ 'మారి' ఫేమ్ బాలాజీ మోహన్ దర్శకత్వం వహిస్తారు. జంగిల్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం మేలో సెట్స్‌మీదకు వెళ్లనుంది. ఈ సినిమాలో హైపర్ థైమీసియా అనే అరుదైన మానసిక రుగ్మతతో బాధపడే పోలీస్ ఇన్‌స్పెక్టర్ పాత్రలో సైఫ్‌అలీఖాన్ కనిపించనున్నారు. తన జీవితంలో జరిగిన ప్రతీ సంఘటనను గుర్తుంచుకోవడం, గతం పదేపదే గుర్తుకు రావడం హైపర్ థైమీసియా రుగ్మత తాలూకు లక్షణాలు. సైఫ్‌అలీఖాన్ పాత్ర చుట్టూ పండే హాస్యం, కథలోని సస్పెన్స్, థ్రిల్లర్ అంశాలు కొత్త అనుభూతిని పంచుతాయని చిత్ర బృందం పేర్కొంది. ప్రస్తుతం సైఫ్‌అలీఖాన్ తెలుగులో 'దేవర-1' చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. దీనితో పాటు హిందీలో ఇన్వెస్టిగేటివ్ డ్రామా 'కర్తవ్య' సినిమాలో నటిస్తున్నారాయన.

## నేరుగా ఓటీటీలోకి కీర్తి సురేశ్ థ్రిల్లర్ సినిమా



స్టార్ హీరో హీరోయిన్లు ఉన్న సినిమాను నిర్మాతలు థియేట్రికల్ రిలీజ్ చేయడానికే ఇష్టపడతారు. కరోనా టైంలో ఓటీటీ రాజ్యమేలింది. కానీ ఇప్పుడు తగ్గుముఖం పట్టింది. జనం హ్యాపీగా హాళ్లకు వెళ్లి సినిమా చూస్తూ వినోదం పొందుతున్నారు. అయితే కొందరు మేకర్స్ ఈ రూట్లో రిస్క్ చేయడం ఇష్టంలేకనో, మంచి ఆఫర్స్ కారణంగానో డిజిటల్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఇప్పుడు ఇదే బాటను కీర్తి సురేశ్ పోలీస్ ఆఫీసర్‌గా నటించిన 'సైరెన్' ఎంచుకుంది. చాలా రోజుల క్రితమే షూటింగ్ పూర్తి చేసుకొని విడుదలకు సిద్ధంగా ఉందీ చిత్రం. 'పొన్నియన్ సెల్వన్'తో ప్రేక్షకులకు దగ్గరైన జయం రవి ద్విపాత్రాభినయం చేశారు. అనుపమా పరమేశ్వరన్ మరో హీరోయిన్‌గా చేసింది. ఆంటోనీ భాగ్యరాజ్ దర్శకత్వం వహించారు. సముద్రఖని, యోగిబాబు తదితరులు కీలక పాత్రలు పోషించారు. ట్రైలర్ విడుదలతో ఈ చిత్రానికి క్రేజ్ బాగానే వచ్చింది. తెలుగు వెర్షన్ కూడా డబ్బింగ్ అవుతోంది. ఇంత క్యాస్టింగ్ పెట్టుకొని ఈ చిత్రాన్ని నేరుగా ఓటీటీలో విడుదల చేసేందుకు నిర్మాతలు ఏర్పాట్లు చేస్తున్నారన్న విషయం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈ చిత్రం జనవరి 26న జీ5 వేదికగా స్ట్రీమింగ్ కావొచ్చని తమిళనాట చెప్పుకొంటున్నారు. ఈ సినిమాలో కీర్తి సురేష్ పాత్ర భిన్న కోణాల్లో సాగుతుందని, పోలీస్ పాత్రలో ఆమె చేసే యాక్షన్ హంగామా మెప్పిస్తుందంటున్నారు. ప్రస్తుతం కీర్తి సురేష్ తమిళంలో వరుస సినిమాల్లో నటిస్తున్నది. గత ఏడాది 'దసరా', 'భోళా శంకర్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్స్ తర్వాత కూడా తెలుగులో ఇప్పటివరకు ఏ సినిమాను అంగీకరించలేదు. ఇదిలావుండగా.. ఈ అమ్మడు బాలీవుడ్ అరంగేట్ర చిత్రం ఆదివారం ప్రారంభమైంది. వరుణ్‌ధావన్ కథానాయకుడిగా అట్లీ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతున్నది.





